క్లుప్తంగా

పౌష్టికాహార కిట్ల పంపిణీ



భూత్పూర్: మండలంలోని వివిధ గ్రామాలల్లో ఉన్న క్షయ బాధితులకు సోమవారం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్లను వైద్యాధికారి డా. అబ్దుల్ రబ్, సిబ్బంది అందజేశారు. ప్రాథమిక వైద్య సిబ్బంది స్వయంగా పోగుచేసిన నిధులతో వీటిని సమకూర్చారు. సీహెచ్ఓ రామయ్య, వైద్యసిబ్బంది ఎలిజబెత్ రాణి, హెలెన్ జ్యోతి, భార్గవేణి, సుధాకర్, యాదమ్మ, చక్రపాణి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జడ్చర్ల టౌన్: బాదేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల తొలగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాసులు, ఏఈ కిరణ్‌కుమార్‌లు ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. బాదేపల్లి ఫీడర్ నిమ్మబావిగడ్డ, మార్కెట్‌యార్డు, రామాటాకీస్, నేతాజీచౌక్, నాగసాల రోడ్‌లలో సిగ్నల్‌గడ్డ ఫీడర్ కల్వకుర్తిరోడ్, గౌరిశంకర్‌కాలని, దేవిటాకీస్, సరస్వతినగర్, వెంకటేశ్వరకాలనీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు సరఫరా ఉండదని వివరించారు. అదేవిధంగా పాతబజార్ ఫీడర్‌లో పాతబస్టాండ్, పద్మావతి కాలనీ, తహసీల్దార్ కార్యాలయం, క్లబ్‌రోడ్, ఎల్‌ఐసీ ఆఫీస్‌రోడ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి గ్రామానికి చెందిన వడ్ల బాలకృష్ణ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని సోమవారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. బాలకృష్ణ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అడ్డాకుల జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేస్తూ అంత్యక్రియల కోసం రూ.5వేలను పంపడంతో వాటిని నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్ యాదవ్, నర్సింహ్మా, భాస్కర్‌రెడ్డి, శివ, బ్రహ్మయ్య, సాయి తదితరులు ఉన్నారు.

'బాధ్యులపై చర్య తీసుకోవాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని బఫర్ జోన్ల పరిధిలో 13చోట్ల అక్రమ కట్టడాలు, ఇళ్ల నిర్మాణాలు వెలిశాయని, బాధ్యులపై తగు చర్య తీసుకోవాలని బీజేపీ కౌన్సిలర్లు ఎ.అంజయ్య, కె.చెన్నవీరయ్య, రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులుకు వినతి పత్రం అందజేశారు. అటువైపు జిల్లా కేంద్రం శివారులోని పిల్లలమర్రి అడవి నుంచి లక్ష్మీనగర్‌కాలనీ, శ్రీనివాసకాలనీ మీదుగా పాల్కొండ పెద్దచెరువు వరకు ఉన్న చిక్కుడువాగు పొడవునా, ఇటువైపు రామయ్యబౌలి అలుగు నుంచి మేకలబండ, శివశక్తినగర్, పాతపాలమూరు మీదుగా ఇమాంసాబ్ కుంట వరకున్న పెద్ద నాలాల పొడవునా కొందరు వ్యక్తులు ఇళ్లు, ప్రహరీలు నిర్మించుకున్నారని అందులో పేర్కొన్నారు. బఫర్ జోన్లలో 80 నుంచి 110 గజాల విస్తీర్ణం ప్లాట్లు చూపి వాటికి హక్కు పత్రాలు సృష్టించి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని వారు ఆరోపించారు.

చెక్కు అందజేత



రాజాపూర్: పేదలకు సీఎం సహాయనిధి వరమని డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం బీబీనగర్ గ్రామపంచాయతీకి చెందిన కమ్లీకి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును అందజేశారు. నాయకులు విజయ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



అడ్డాకుల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న నాలుగు పోలింగ్ కేంద్రాలను సోమవారం తహసీల్దార్ కిషన్, ఎస్ఐ మాధవరెడ్డి సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. ఓటర్ల కోసం ఏర్పాటు చేయాల్సిన వసతుల గురించి వాకబు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నేనావత్ శ్రీనునాయక్, మాజీ ఎంపీటీసీ భీమన్నయాదవ్, కారోబార్ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

కేజీబీవీ..గజిబిజి

- సమస్యలతో సతమతం
- సమయపాలన పాటించని ఉపాధ్యాయులు
- విద్యార్థులకు బోరునీళ్లే గతి
- పనిచేయని ఫ్యాన్లు
- కొరవడిన పర్యవేక్షణ



డైనింగ్ హాల్‌లో పనిచేయని ఫ్యాన్లు



మహమ్మదాబాద్ కేజీబీవీ

గండేడ్: కేజీబీవీల ద్వారా పేద విద్యార్థులకు అన్ని రకాలుగా చేయూతనందించి వారి విద్యాభివృద్ధికి తోడ్పాటునందించాలన్న ప్రభుత్వ ఆశయం కొందరి నిర్లక్ష్యం వల్ల నీరుగారిపోతోంది. ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడం, అసౌకర్యాలు విద్యార్థుల పాలిట శాపంగా మారుతున్నాయి. ఇందుకు నిదర్శనంగా మహమ్మదాబాద్ కేజీబీవీని చూపించవచ్చని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక్కడ 6 నుంచి ఇంటర్ వరకు తరగతులు ఉన్నాయి. మొత్తం 467 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. కాగా స్కూల్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ఏటా సమస్యలు పెరుగుతూనే ఉన్నాయి. గదులు సరిపోయేంతగా ఉన్నా మిగతా వసతులు అరకొరగా ఉన్నాయి.

సమస్యలు ఇలా..

- విద్యార్థుల స్నానాలకోసం ఏర్పాటు చేసిన సోలార్ హీటర్ ప్లాంటు రెండేళ్లుగా పనిచేయడం లేదు.
- డైనింగ్ హాల్ సరిపోయినంతగా లేకపోవడంతో చాలామంది బయట కూర్చుని భోజనం చేస్తున్నారు.



ఇద్దరు ఉపాధ్యాయులతోనే అసెంబ్లీ నిర్వహణ

- పాత భవనంలో డైనింగ్ వద్ద, కొత్త భవనంలో టాయిలెట్స్ వద్ద నల్లాలు లీకవుతున్నాయి.
- ఉన్న రెండు బోర్లలో ఒకటి గతేడాది విద్యా సంవత్సరం ముగింపు సమయంలో మరమ్మతుకు గురైంది. పాఠశాల వెనకవైపు ఎస్టీపీ యూనిట్‌ను అప్పట్లో ఏర్పాటు చేసినా పనిచేయడం లేదు.
- ఫిల్టర్ వాటర్ యూనిట్ పనిచేయకుండా పోవడంతో విద్యార్థులు బోరు నీళ్లే తాగుతున్నారు.
- ఉపాధ్యాయులు మాత్రం రోజు రెండు బిందెల ఫిల్టర్ నీరు తెప్పించుకొని తాగుతున్నారు.
- రెండు పూటల విద్యార్థులకు చాలీ చాలని పాలు అందిస్తున్నారు. పాఠశాల ప్రారంభం నుంచి పది రోజుల వరకు అసలు ఇవ్వనేలేదు.
- పాఠశాల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు

పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇష్టానుసారంగా వస్తున్నారని అంటున్నారు. అసెంబ్లీ సమయంలో నైట్ డ్యూటీలో ఉన్నవారితో పాటు ఒకరిద్దరు మాత్రమే ఉంటున్నారని చెబుతున్నారు. కొందరు తాపీగా 10 గంటల నుంచి 11 గంటల వరకు కూడా పాఠశాలకు చేరుకుంటున్నారు. పాఠశాలలో మొత్తం 22 మందిలో 12 మంది టీచింగ్ స్టాఫ్, 10 మంది నాన్‌టీచింగ్ స్టాఫ్ ఉన్నారు. మరో 4 లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

కొరవడిన పర్యవేక్షణ

కేజీబీవీ నిర్వహణ అస్తవ్యస్తంగా ఉన్నా ఎవరు పట్టించుకోవడం లేదు. మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారులు గానీ పాఠశాలను సందర్శించిన దాఖలాలు లేవు. వసతులు, పౌష్టికాహారం వంటివి సరైన రీతిలో విద్యార్థులకు సమకూరడం లేదు. ఎవరైనా అసౌకర్యాల గురించి చెబితే వారిని బెదిరిస్తున్నారు. ఎవరు నోరు మెదపకూడదని హుకుం సైతం జారీ చేస్తున్నారంటే ఇక్కడ పరిస్థితి ఏలా ఉందో అర్థచేసుకోవచ్చని పలువురు అంటున్నారు. గతేడాది పదోతరగతి ఫలితాల్లో 56 శాతం ఫలితాలు మాత్రమే వచ్చాయి. 50 మందికి 28 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం. ఉపాధ్యాయులు సమయానికి రావాల్సిందే. ఫిల్టర్‌ను మరమ్మతు చేయిస్తాం. అవసరమైన ఫ్యాన్లు కూడా ఏర్పాటు చేయించేలా చూస్తాం. కొత్తగా టెండర్లు వేశాం. వారి ద్వారా పాలు, పండ్లు, కూరగాయలు నాణ్యమైనవి అవసరం మేరకు సరఫరా జరిగేలా చూస్తాం. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు ప్రిన్సిపాల్‌ను గట్టిగా ఆదేశిస్తాం. తరుచు తనిఖీలు చేపడతాం.

– పల్లవి, జీసీడీఓ, మహబూబ్‌నగర్

'డబుల్' ఇళ్ల కోసం బస్సు యాత్ర



కోడూర్ చౌరస్తాలో బస్సు యాత్ర కన్వీనర్ వీరయ్యకు స్వాగతం పలుకుతున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: పేదలందరికీ డబుల్ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర సోమవారం మండల పరిధిలోని కోడూర్ చౌరస్తాకు చేరుకుంది. ఈ సందర్భంగా బస్సు యాత్ర కన్వీనర్ ఎస్.వీరయ్య మాట్లాడుతూ పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుందని అన్నారు. ఖాళీ స్థలాల్లో పేదలు వేసుకున్న గుడిసెలను రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రోత్సలంతో అధికారులు తొలగిస్తున్నారని మండిపడ్డారు. ఈ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్, ఉపాధ్యక్షుడు హన్మంతు, వెంకట్రాములు, మల్లు లక్ష్మి, సైక్లాబ్‌బాబు, కోటా రమేష్, జగ్గారెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

పరీక్షలు వాయిదా వేయాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ పరిధిలో పలు పీజీ పరీక్షలు కొనసాగుతున్న నేపథ్యంలో ఇదే నెలలో సీపీజీఈటీ -2023 పరీక్షలు ప్రస్తుతం కొనసాగుతున్నాయని వీటిని దృష్టిలో ఉంచుకుని వాయిదా వేయాలని ఏబీవీపీ నాయకులు పీయూ కంట్రోలర్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, లేదంటే ఏదో ఒక పరీక్షకు గైర్హాజరుకావాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్జున్, ప్రవీణ్, శరత్, కృష్ణ, శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



జడ్చర్లలో ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

జడ్చర్ల టౌన్: ప్రజాసమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని రైతుసంఘం రాష్ట్ర నాయకులు రాములు అన్నారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ప్రసంగించారు. వారం రోజులుగా ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మున్సిపాలిటీ, గ్రామాల్లో సమస్యలపై సర్వే నిర్వహించామన్నారు. సర్వేలో రేషన్‌కార్డులు, పింఛన్లు లేకపోవటం, డబుల్‌బెడ్‌రూం కేటాయింపులు వంటివి అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయన్నారు. వాటన్నింటిని వెంటనే పరిష్కరించాలన్నారు. వినతిపత్రాన్ని తహసీల్దార్ లక్ష్మీనారాయణకు అందజేశారు. వివిధ సంఘాల నాయకులు జగన్, సత్తయ్య, లక్ష్మీదేవి, వాసియాబేగం, సాయిలు, మున్నా, సుందరమ్మ, బాలమణి, ఆంజనేయులు, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకులు కిల్లె గోపాల్ మాట్లాడుతూ గ్రామాలల్లో ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ చెన్న కిష్టన్నకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వి.కురుమూర్తి, గ్రామ పంచాయతీ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటేష్‌గౌడ్, మైబు, నారాయణ పాల్గొన్నారు.

బాలానగర్: ప్రభుత్వ స్థలాలను, భూములను గుర్తించి అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్ డిమాండ్ చేశారు. సోమవారం బాలానగర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు, గ్రామ కార్మికులు పాల్గొన్నారు.

హన్వాడ: పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నాయకులు ఎ.లక్ష్మయ్య, రాములు, మొగులయ్య, ఎం.రాములు, రేఖమయ్య, చిన్నయ్య, పద్మమ్మ, మొగులమ్మ, అంజిలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: ప్రజసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ పార్థసారథికి వినతిపత్రం అందజేశారు. నాయకులు జి.రాజ్‌కుమార్, పద్మ, వరదగాలన్న, ఆదివిష్ణు, అనురాధ, కాశన్న, భగవంతు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్‌లో..



భూత్పూర్‌లో..

పాఠశాలల్లో వసతులు కల్పించాలి



తిర్మలాపూర్‌లో మాట్లాడుతున్న నాయకులు

రాజాపూర్: ప్రభుత్వపాఠశాలల్లో వసతులు కల్పించాలని ఏబీవీపీ రాజాపూర్ మండల కన్వీనర్ ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్రశాఖ పిలుపు మేరకు పాఠశాలలను బంద్ చేయించారు. అధికఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు బాల్‌రాజ్, లక్ష్మీనారాయణ, సాయికుమార్, పవన్, నందు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఐ రవీందర్‌రెడ్డికి పదోన్నతి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ట్రాన్స్ కో ఉమ్మడి జిల్లా విజిలెన్స్ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఎం.రవీందర్‌రెడ్డికి డీఎస్పీగా పదోన్నతి లభించింది. వనపర్తి జిల్లా అమరచింతకి చెందిన ఆయన ఎస్ఐగా, సీఐగా పనిచేశారు. ప్రస్తుతం డీఎస్పీగా విధులు నిర్వహించనున్నారు.

పట్టణంలో కేంద్రమంత్రి పర్యటన



వెంకట సుబ్బయ్యతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి మహేంద్రనాథ్ పాండే

పాలమూరు: జన సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రానికి వచ్చిన కేంద్ర భారీ పరిశ్రమల శాఖా మంత్రి మహేంద్రనాథ్ పాండే సోమవారం ఉదయం మొదట బీజేపీ నేత పదాకుల సత్యం ఇంట్లో టిఫిన్ చేశారు. అక్కడి నుంచి కోడూర్‌లో నిర్వహించిన కేంద్ర పథకాల లబ్ధిదారుల సమావేశానికి హాజరయ్యారు. అనంతరం మధ్యాహ్నం భగీరథ కాలనీలో బీజేపీ నేత పాండురంగారెడ్డి ఇంట్లో భోజనం చేశారు. అక్కడి నుంచి టీడీ గుట్టకు చెందిన లబ్ధిదారుడు వెంకట సుబ్బాయ్య ఇంటికి వెళ్లారు. ఆయనతో సమావేశమయ్యారు. తరువాత అక్కడి నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లారు. జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారీ, బీజేపీ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, జయశ్రీ, బురుజు సుధాకర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, నారాయణ యాదవ్, పద్మవేణి తదితరులు ఉన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

మిడ్జిల్: సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిందని మిడ్జిల్ ఎంపీపీ సుదర్శన్ అన్నారు. సోమవారం పీహెచ్‌సీలో నిర్వహించిన ఆరోగ్యకమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. పీహెచ్‌సీ కాయకల్పకు ఎంపిక కావటం అభినందనీయమన్నారు. పీహెచ్‌సీకి అవసరమైన పరికరాలు కొనుగోలు చేసేందుకు తీర్మానం చేస్తున్నామన్నారు. రూ.20లక్షలతో పీహెచ్‌సీలో అవసరమైన మరమ్మతులు పూర్తిచేసినట్లు వివరించారు. గ్రామాల్లో 4 మినీసెంటర్ల ఏర్పాటు కోసం నిధులు మంజూరు అయ్యాయన్నారు. సమావేశంలో భాగంగా సీపీఆర్‌లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఆశవర్కర్లకు చీరలు పంపిణీ చేశారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జంగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు రాధిక, నారాయణ్‌రెడ్డి, డా. మనుప్రియ, కృష్ణకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

జూలై 2న ఆత్మీయ సమ్మేళనం



కందూర్‌లో సమావేశమైన బీఆర్ఎస్ నాయకులు

అడ్డాకుల: మండల కేంద్రంలో జూలై 2న బీఆర్ఎస్ మండల యువత ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు నాయకులు బాలరాజు, మహేష్ యాదవ్ తెలిపారు. చౌడాయపల్లి, కందూర్, పొన్నకల్ గ్రామాల్లో సోమవారం బీఆర్ఎస్ యువతతో సమావేశాలు ఏర్పాటు చేసి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి యువత అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. సమావేశానికి దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, కందూర్ సర్పంచ్ శ్రీకాంత్, ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, రాము, కుమ్మరి శ్రీను, భాస్కర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మండలం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన మండల సాధన కమిటీ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/కోయిల్‌కొండ : గార్లపహాడ్‌ను మండలం చేయాలని సాధన కమిటీ కన్వీనర్ రామునాయక్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ రవినాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. 153 రోజులుగా దీక్షలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. మండలం చేసేదాక పోరాటం చేస్తామని పేర్కొన్నారు. 10 గ్రామాల తీర్మానాలతో పాటు పది వేల సంతకాలను సేకరించి కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించినట్లు వివరించారు. కోకన్వీనర్ వెంకటేశ్వర్ రెడ్డి, రఘు, ఆంజనేయులు, వెంకటేష్ పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి



మిడ్జిల్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మిడ్జిల్: ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను సోమవారం మండల కేంద్రంలో మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు శంకర్, రమేష్, తిరుపతి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: ముదిరాజ్‌లను దూషించిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బీసీసేన నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి లింగంపేట శేఖర్, మండల అధ్యక్షుడు నిరంజన్‌లు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వెంటనే ఆయన ఈటెల రాజేందర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఇంటిని ముట్టడిస్తామన్నారు.

నవాబుపేట: ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు రవి, లింగం, లాలయ్య, యాదయ్య, మహేష్, సుదర్శన్, కృష్ణ, నర్సింహులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను నాయకులు దహనం చేశారు. ఎంపీటీసీ చెన్నయ్య, ఉప సర్పంచ్ అశోక్, మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నర్సిములు, కేశవులు, శ్రీను, బాల్‌రాజు పాల్గొన్నారు.

'ఓటమి భయంతోనే ముంబయికి'



సమావేశంలో మాట్లాడుతున్న రామునాయక్

కోయిల్‌కొండ: నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డిపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడడంతో ఓటమి భయం పట్టుకుందని దీంతోనే ముంబయికి వెళ్లి వలసదారులతో ఓట్లు అడుగుతున్నారని కాంగ్రెస్ మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు రామునాయక్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వలసదారులకు ఇక్కడ ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.నాయకులు మంగ్యానాయక్, తుక్యానాయక్, అశోక్, దాసు, వెంకట్ నాయక్, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



లోకిరేవులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు, ప్రజాప్రతినిధులు

నవాబుపేట: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. సోమవారం లోకిరేవులో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కవద్దన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనంతయ్య, సర్పంచ్ సత్యం, పోలీసు సిబ్బంది మోగిలిరెడ్డి, వెంకటేష్, శ్రీను, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



కప్లాపూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

గండేడ్: మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా సోమవారం గండీడ్ మండలంలోని కప్లాపూర్ గ్రామంలో ఇంటింటికీ తిరిగి కేంద్రం పాలనపై వివరించారు. మండల అధ్యక్షుడు ప్రభునాయక్, ప్రధాన కార్యదర్శి నరహరిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నర్సయ్య, బీమయ్య, మల్లేష్, రాంచంద్రయ్య పాల్గొన్నారు.